
ఉక్కు కాలనీల్లో

స్థలాల సర్వేకు శ్రీకారం

- స్థల పరిశీలనలో బృందాలు
- గృహ యజమానుల నుంచి పత్రాల సేకరణ
- త్వరలోనే వివాదాలకు చెక్


ఉక్కు నిర్వాసిత కాలనీ

గాజువాక : ఉక్కు నిర్వాసిత కాలనీల్లో స్థలాల సర్వేకు జిల్లా అధికారులు శ్రీకారం చుట్టారు. సెక్టార్ల వారీగా నియమించిన సర్వే బృందాలు ఆయా కాలనీల్లోని స్థలాలను పరిశీలిస్తున్నాయి. బృంద సభ్యులు ఇంటింటికీ వెళ్లి గృహ యజమానుల నుంచి అలాట్‌మెంట్లు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, నమోదు చేసుకుంటున్నారు.

స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తమ భూములు, ఇళ్లను త్యాగం చేసిన నిర్వాసితులకు వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, పెదగంట్యాడ, గంగవరం ప్రాంతాల్లో పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి, స్థలాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ కాలనీల్లో స్థల వివాదాలు ఇటీవల ఎక్కువయ్యాయి. తమ స్థలాన్ని ఫలానా వారు కబ్జా చేశారంటూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. మరికొన్ని చోట్ల ఎటువంటి పత్రాలు లేకుండా స్థలాల్లో అనధికార వ్యక్తులు ఇళ్లు నిర్మించారంటూ ఫిర్యాదులు అందడంపై అధికారులు స్పందించారు. ఏ కాలనీలో ఎన్ని స్థలాలు ఉన్నాయి, ఎవరికి కేటాయించారు, ఏ హక్కుతో ఇళ్లను నిర్మించారు, ఎంతమందికి ఆర్ కార్డుల ద్వారా స్థలాలు మంజూరయ్యాయి వంటి వివరాలను సేకరించాలని నిర్ణయించి సర్వే బృందాలను నియమించారు. వార్డులలో వలంటీర్ల సహకారంతో ఆయా బృందాలు తమ పనిని ప్రారంభించాయి.

అందరూ సహకరించాలి

సర్వే బృందాలకు స్థల, గృహ యజమానులు సహకరించాలి. ఈ సర్వే వల్ల స్థల యజమానులకు మేలు జరుగుతుంది. సర్వే పూర్తయిన తరువాత పూర్తిస్థాయి జాబితాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. వివాదాలు తగ్గుతాయి. ప్రతి ఒక్కరూ తమ స్థలంపై గల హక్కు పత్రాలను సర్వే బృందాలకు అందజేయాలి. – రామ్మోహనరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ల్యాండ్ ఎక్విజిషన్

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

- ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు వివరించాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు

పెదగంట్యాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 69, 70 వార్డులకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ప్రతీ కుటుంబానికి అందుతున్న లబ్ధిని తెలపాలన్నారు. విద్య, వైద్యరంగాలకు సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేయాలని సూచించారు. భావితరాల భవిత కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను ఆధునికీకరించి, విద్యార్థులకు సౌకర్యాలను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాల కల్పన, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి ఎన్నో కార్యక్రమాలతో వైద్యఖర్చుల భారం లేకుండా చేస్తున్నారని చెప్పారు. వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్లు అందిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని చెప్పారు.

జగనన్నకు అండగా నిలవాలి

ప్రజల కోసం ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను వారికి తెలియజేసి, జగనన్నకు అండగా నిలబడాలని కోరారు. పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణకు సంబంధించిన వీడియో క్లిప్పింగులు ప్రదర్శించారు. ప్రభుత్వం రూపొందించిన స్టిక్కర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, బోగాది సన్నీ, ఎండీ గౌస్, కుమార్, అప్పలరెడ్డి, యువశ్రీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెట్లకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నర్సింగరావు

గాజువాక : ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెట్ పోటీలకు హాజరు కానున్న విశాఖ క్రీడాకారులకు బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆర్థిక సాయం అందజేశారు. కర్ణవానిపాలెంలో మంగళవారం నిర్వహించిన మాస్టర్ అథ్లెట్స్ సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 40 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వారిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరికి సాయం అందజేశామని తెలిపారు. క్రీడాకారులు ఈ పోటీల్లో విజయం సాధించి రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వరప్రసాద్, కోశాధికారి పేర్ల సత్యారావు, ప్రతినిధి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: దువ్వాడ మంగళపాలెం ప్రాంతానికి చెందిన సంపంగి త్రినాథ్ (46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపాలెం ప్రాంతంలోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం బ్లాక్ నెంబర్ 63లోని ఎఫ్ఎఫ్–4లో ఉంటున్న సంపంగి త్రినాథ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపంతో త్రినాథ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, ఆయన ఒంటరిగా ఉండడంతో మృతి చెందిన విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం సాయంత్రం వారు నివసిస్తున్న బ్లాక్‌లో నీరు ఎక్కడం లేదని పైన ట్యాంక్ చూసేందుకు సుమారు 5గంటల సమయంలో పైకి వెళ్లిన స్థానికులకు త్రినాథ్ కిటికీ హుక్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మౌనిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

ఫలితాల్లో తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా..

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎన్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్‌నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎస్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన మురళీకృష్ణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం)లో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. విభాగం వర్గాల సమాచారం మేరకు వివరాలివి.. లంకెలపాలేనికి చెందిన ఎం. మురళీకృష్ణ (31) విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. యథావిధిగా విభాగంలో పనులు నిర్వహిస్తుండగా, సరకులు రవాణా చేసే ఫోర్క్‌లిఫ్ట్ అతని కాలుపై వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతని కాలు విరిగిపోయి తీవ్రంగా రక్తస్రావం అయింది. వెంటనే మురళీకృష్ణను ఉక్కు జనరల్ ఆస్పత్రికి, ఆ తర్వాత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అతని కాలు తీసేయాలని చెప్పినట్లు సమాచారం. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ


పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గాజువాక భూ సమస్యను పరిష్కరించాలి

గాజువాక : గాజువాక భూ సమస్యను పరిష్కరించాలని, వివిధ జీవోలతో గతంలో ఇచ్చిన పట్టాలపై ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, నాయకులు పులి వెంకట రమణారెడ్డి, గోమాడ వాసు, ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం


మిందిలో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులో మౌలిక వసతుల్లో భాగంగా రోడ్డు, కాలువలు, మంచినీటి పైపులైన్ల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టామని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. వార్డు పరిధి మిందిలో మాజీ మంత్రి దివంగత గుడివాడ గుర్నాధరావు సమాధి నుంచి బస్‌స్టాండ్ వద్ద గల ఏటీఎం సెంటర్ వరకు రూ.20 లక్షల వ్యయంతో కొత్త రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను లతీష్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈటి సురేష్, గుడియా శ్రీనివాసరావు, గోలి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి అర్చకులు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేసి, కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ప్రజా సంక్షేమానికి సీఎం కృషి


మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దొమ్మేటివీధి, ముల్లివానిపాలెం, శెట్టిబలిజ వీధి, అయ్యన్నపాలెం నెల్లిముక్కులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి, వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందని వారు ఎక్కడా లేరని చెప్పారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఒక పక్క సంక్షేమం.. మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలిపేందుకు పాటు పడుతున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం ఖాయమన్నారు. ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని, వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. అనంతరం స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు నిర్మించాలని, సచివాలయం మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. స్పందించిన ఆయన వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, వెంపాడ అప్పారావు, వెంకటేష్, పెద్దిరెడ్డి, తోకాడ అప్పారావు, గేదెల మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్ చంద్ర, సీవో ఉదయ్ భాస్కర్, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఇన్‌సాన్ అవార్డులు


అవార్డు గ్రహీతలతో జీఎం మధుసూదనరావు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆరుగురు ఉద్యోగులకు ఇన్‌సాన్ అవార్డులు లభించాయి. ఇండియన్ నేషనల్ సజెషన్ స్కీం అసోసియేషన్ (ఇన్‌సాన్) ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కె.వి.వి. పవన్ కుమార్ (ఈఎస్ఎఫ్), వై.అప్పలరాజు (ఎస్ఎంఎస్)లు బెస్ట్ సజెస్టర్ కేటగిరీలో పార్ ఎక్స్‌లెన్స్ అవార్డులు గెలుచుకోగా, టి.వేణు (ఎం.ఎం.ఎస్.ఎం) ఎక్స్‌లెన్స్ అవార్డు సాధించారు. అదే విధంగా టెక్నికల్ పేపర్ కేటగిరీలో మహ్మద్ అబ్దుల్లా (ఎస్.ఎం.ఎస్) పార్ ఎక్స్‌లెన్స్ సాధించగా అయంతియా రాయ్ (సీఎస్ఎం) ఎక్స్‌లెన్స్ అవార్డు, ప్రవాస్ కుమార్ దాస్ (డీ అండ్ ఈ) విశిష్ట అవార్డు గెలుపొందారు. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ అవార్డు గ్రహీతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపేవరకు ఉద్యమం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 726వ రోజుకు రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగే వరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పార్లమెంట్‌లో ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో 726వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, యు.రామస్వామి మాట్లాడారు. ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు గత 30 ఏళ్లుగా కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. నిర్వాసితుల త్యాగాన్ని, కార్మికుల కష్టాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సాయిరాం, రవికిరణ్, ఈశ్వరరావు, మధు, వెంకటరావు, నగేష్, నల్ల రవి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వేతన సవరణ జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతన సవరణ చేయడంలో జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఉక్కు అడ్మిన్ వద్ద మంగళవారం చేపట్టిన దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. మొత్తం కార్మిక వర్గం కోసం ఎన్‌జేసీఎస్‌లో అనేక సార్లు చర్చలు జరిగి, చివరకు ఒప్పందం జరిగిందన్నారు. ఒప్పందం మేరకు సెయిల్‌లో అమలు చేసినా స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వేతన సవరణపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వేతన సవరణలో జాప్యం వల్ల కార్మికుల్లో అశాంతి పెరుగుతోందని, ఇప్పటికైనా యాజమాన్యం పెంచిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిత్ర పక్షాల నాయకులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జీవీఎంసీ కార్యాలయ భవనం


శిథిలావస్థలో అగనంపూడిలోని జీవీఎంసీ భవనం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని జీవీఎంసీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. జీవీఎంసీలో విలీనం అయ్యేవరకు పంచాయతీ కార్యాలయం నిర్వహించినా.. అనంతరం ఆ భవనాన్ని జీవీఎంసీకి అప్పగించారు. ఆరంభంలో నీటిసరఫరా, రెవెన్యూ కార్యాలయాలు నిర్వహించేవారు. తరువాత ఒక్కో విభాగం ఒక్కో చోటకు తరలిపోవడంతో ప్రస్తుతం శానిటరీ, జనన, మరణ ధ్రువీకరణ కేంద్రం మాత్రం కొనసాగుతున్నాయి. నీటి సరఫరా విభాగం బీసీ కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో పంప్‌హౌస్‌కు తరలిపోగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి కార్యాలయాలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో శిథిల భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆ భవనం ఎప్పుడు కూలిపోతుందో అని ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న శిథిల భవనం తొలగించి నూతనంగా భవన నిర్మాణం చేపడితే ప్రజా సేవలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధి సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

ఏయూ క్యాంపస్: ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎదగాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన స్వాగత సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉపాధి కోసం ఎదురుచూడకుండా అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. దీనికి అవసరమైన వ్యవస్థను విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్లేస్‌మెంట్ సంఖ్య పెరగడం, విద్యార్థులు అధిక వేతనాలతో ఉద్యోగాలను సాధించడం చూస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాలకు పునరుజ్జీవనం, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కళాశాల పరిధిలో 97 శాతానికి పైగా సీట్లు భర్తీ కావడం దీనికి నిదర్శనమన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఆరు విధాల స్టార్టప్ ఎకోసిస్టంలను అభివృద్ధి చేసిన విధానాన్ని వివరించారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ తదితరులుపాల్గొన్నారు.